కోడలు

శ్రీమతి పులిపాక బాలాత్రిపురసుందరమ్మగారు

"వెంకమ్మగారు! మీ అబ్బాయికి సంబంధం కుదిరిందా?"

"కుదరటానికి యెవరు ఆలోచిస్తున్నారు? ఎక్కడికన్నా వెళ్ళి కనుక్కుంటే గౌరవంగా ఉండదంటారు మా పంతులుగారు. ఆడదాన్ని నేనేం చేస్తాను సుబ్బమ్మొదినా?"

"నిజమే ఆయనగారు అనేమాట మంచిదే. ఆడపిల్ల నిచ్చేవాళ్ళు మనింటికి రావాలి గాని మనం వాళ్ళింటికి వెళ్ళితే బెట్టుగా ఉండదు."

"మనం బెట్టుగా కూర్చుంటే మనింటికి తీసుకొచ్చి ఎవరిస్తారు పిల్లను? మా ఎస్టేట్లు చూచివస్తారా? మనబ్బాయి బి.ఏ.చూచివస్తారా? చెప్పు సుబ్బమ్మా?"

"అదీ నిజమే వెంకమ్మగారు. కొంచం ఆలోచించకుండా పెళ్ళిళ్ళు యెల్లా అవుతాయి మనబోటి సంసారాల్లో—",

"మీ వాళ్ళల్లో యెవరన్నా పిల్ల ఉంటే కుదుర్చు సుబ్బమ్మొదినా నీకూడా పుణ్యం ఉంటుంది."

"అయితే వెంకమ్మగారు! మీ అబ్బాయి యెంత బేరంలో ఉన్నాడు?"

"సుబ్బమ్మా! నాతో చమత్కారమా నీకు? బేరమేమిటి యెల్లాగో వాడికి రెండుపోగులేస్తే కంటితో చూద్దామని ఉన్నది నాకు. అంతేగాని బేరం పెట్టగల ఆస్తులు ఉద్యోగాలు ఏమున్నాయి మనకు?"

"చమత్కారం కాదు వదినా. మగపిల్లలు కలవాళ్ళ పద్ధతులు ఇప్పుడు అవ్వే గనుక అడిగాను."

"కొడుక్కు పెండ్లి కాదనా నీ తొందర? బాగానే అవుతుంది. నీవు అత్తగారి వౌతావు. కోడలొస్తే మాతో పలుకుతావా?"

"అంత రోజు రానిస్తూ నీ నోటినిండా పంచదార పోస్తాను."

"ఇంత కష్టపడి కుదిరిస్తే ఇంతేనా నాకు?"

"పప్పూ లేవు బియ్యం లేవు పలగం పులగం అన్నట్లు పిల్ల కనిపించలేదు నాతో హాస్యము నీకు."

"పిల్ల ఉన్నదిలే చెప్పు మీఅభిప్రాయం నిజంగా."

"నిజమేనా సుబ్బమ్మా?"

"నీతో అబద్ధమాడుతానా?"

"యెవరిపిల్ల?"

"మా చెల్లెలి మఱిదికూతురు. పదేండ్లపిల్ల చక్కగా ఉంటుంది. చదువు సంగీతములన్నీ నేర్చుకుంటున్నది. మఱిదంటే పిన్నత్తగారి కొడుకు."

"యెవరైతే మనకెందుకు? మన కనుకూలమైతే సరి. నీ ధర్మమా అని వాడు ఒకయింటివాడైతే నిన్ను తలుచుకుంటాడు."

"సరే మీవాళ్ళతో ఆలోచించు. అవల మా వార్ని పంపుతాను. ఒదినా!" అని మళుపుతిరిగి అవతల వీధికి వెళ్ళింది సుబ్బమ్మ బిందె బుజాన పెట్టుకొని.

సుబ్బమ్మగారి దగ్గిర సెలవుతీసుకొని యింటికి చేరింది వెంకమ్మగారుకూడా నీళ్లాట రేవునుంచి.

— ౨ —

చెఱువుకు బట్టలు ఉతకటానికి వెళ్ళిన వెంకమ్మగారికి ఆ రోజు ఒక సుదినం అనిపించింది. సుబ్బమ్మగారు తన కొమారుడి పెండ్లి విషయమైన సంగతులు చెప్పగానే ఆమెకు పరమసంతోషం కలిగింది. ఇంటికి రాగానే బిందె పడమటింట్లో దింపి తడిబట్టలు దొడ్లో రోటిమీద పెట్టి, ఈకబుర్లు యెప్పుడు భర్తతో చెప్పుదునా అనే ఆదుర్దాతో వచ్చింది తూర్పు వసారాలోకి.

పొదరయొండలో తాటాకుల చాపమీదకూర్చుని విస్తళ్లు కుట్టుకుంటున్నాడు వెంకమ్మగారి భర్తపానకాలుగారు. తడివస్త్రముతో భార్య రాకచూచి "తడిగుడ్డతో పెత్తనాలేమిటి?" అన్నాడు కొంచం కోపంగా.

"పెత్తనాలు కాదు ఇవ్వాళ చెఱువుదగ్గిర కామయ్యగారి భార్య సుబ్బమ్మ కనిపించి చెప్పింది; వాళ్ల బంధువులపిల్ల యెవరో ఉన్నదిట మనబ్బాయికిప్పిస్తానని."

"సరే మంచిదే మాట్లాడుదాం."

"మధ్యాహ్నం మనింటికి వారే వస్తారట."

"సరే వస్తే మాట్లాడుకుని శుభమస్తు అనుకుందాం. త్వరగా వంటకానీ. ఇవ్వాళ పడమటిపొలం కోత కోస్తారుట వెళ్లి చూసి రావాలి."

"ఎంతసేపవుతుంది లెండి" అని ఇంట్లోకి వెళ్లింది వెంకమ్మ.

లోవర సెకండరీ పరీక్షఅయి హయ్యరు ట్రైనింగు ప్యాసయి, దగ్గిరపల్లెటూళ్లో ఆక్టింగుగా పనిచేస్తున్నాడు, వెంకమ్మగారి కొమారుడు. శలవులకు ఇంటికొచ్చి ఇక్కడే ఉన్నాడు. తన వివాహవిషయంలో తల్లితండ్రీ సంభాషణ వింటూ తడికల గదిలో పడుకున్నాడు.

3

పానకాలుగారు పూర్వకాలం మనిషైనప్పటికీ ముందాలోచన మరియాద కలవాడు. తెలివి కలవాడు చమత్కారికూడాను. తనకున్న ఆరు యెకరముల పొలము స్వంతాన వ్యవసాయం చేయించుకుంటూ, అప్పూసొప్పూ లేకుండా జీవనం చేస్తున్నాడు.

మధ్యాహ్నం రెండుగంటలైంది. పానకాలుగారు భోజనము చేసి నిద్రపోయిలేచి, ఇంతలో భార్య చెప్పిన మాట జ్ఞాపకం వచ్చి వీధిగుమ్మం వంక చూస్తున్నారు. ఇంతలో సుబ్బమ్మగారి భర్త కామయ్యగారు వారి బంధువులు రావడం చూచి ఓహో బావగారు! అని స్వాగతం యిచ్చి యింట్లోకి తీసుకొచ్చారు పానకాలుగారు.

ఆహ్వానం అందుకుని అందరు వచ్చి చాపలమీద కూర్చున్నారు.

"ఏమండి పానకాలు బావగారు! వీరు మా పెద్దకుడిగారి తమ్ముడు. వీర్ని ఇదివరకు చూచారా? వారు వీరి బావమఱదిగారు," అని అందర్ని ఎఱుకపరచారు కామయ్యగారు పానకాలుగారికి.

"మీ పెద్దకుడుగారిని యెఱుగుదునుగాని వీర్ని ఎఱుగనండీ" అన్నాడు పానకాలు.

"వీరి కుమార్తెను మీ కుమారుడికి ఇవ్వవలెనని వచ్చారు."

"శుభం అభ్యంతర మేమున్నదీ?"

"అయితే? మీ కుమారుణ్ణి యే మాత్రం కిమ్మతు చేశారో అదికూడా శలవియ్యండి" అని నవ్వాడు కామయ్యగారు.

"బావగారూ! యేం కిమ్మతు వేసినా తను కే వెయ్యాలి నలుగురికొమాళ్ల వివాహాలు చేశారు గనుక" అన్నాడు పానకాలుగారు చిరునవ్వుతో.

"సరే ఏమిటి మీ అభిప్రాయం తెల్పండి?" అన్నాడు కామయ్యగారు.

"నా దేముందండీ బావగారు! మీ అభిప్రాయమే నా అభిప్రాయం మీరే చెప్పండి?"

"వారు వెండిచెంబు వెండిగిన్నె వెండికంచము పట్టుపంచలు ఇస్తారట మీ కిష్టమా? అయిష్టమా? చెప్పండి."

"సరే ఇష్టమేగాని పిల్లవాడు కోరుతున్నాడు."

"సరే చెప్పండి. భరించకలిగితే భరిస్తారు లేకపోతే వెళ్లుతారు."

"ఉంగరము, సైకలు, చేతిగడియారము కావాలంటున్నాడు. ఏమి గొప్పవి కోర్లేదులెండి వాడైనా. నేనేమి డబ్బు కాసపడేవాణ్ణి కాదు గదా? యేవి ఇచ్చుగున్నా మీ అల్లుడి ముచ్చటకే."

'యేమంటారు' అన్నట్లు కన్యాదాత వంకచూశాడు కామయ్య. 'సరే' నన్నట్లుగా తలఊపాడు కన్యాదాత.

"సరే తాంబూలాలు పుచ్చుగోండి" అని జేబులో నుంచి తమలపాకులు తీశారు కామయ్యగారు.

ఇంతలో తలుపుచాటునుంచి వెంకమ్మగారు అన్నది.

"కామయ్య అన్నగారు ఆడపిల్లల సంగతికూడా అనుకోవాలి."

"ఏమిటండీ వెంకమ్మగారు ఆడపిల్లలకు అంటే? వారేమి భరించలేరు ఏమంటారు మీరు?"

"ఏమి లేదండి. ఆడపిల్లలిద్దరికి చెరొక పాతిక రొక్కము, బొట్టుపెట్టెలు వైగయిరా సామాను అందరికి తెలిసినవే కదా? వాళ్లకుమటుకు ముచ్చటెల్లా జరుగుతుంది? ఈ వక్కడే పిల్లవాడు మాకు."

అందరు వక్కనిముషము నిశ్శబ్దంగా ఉండి తరువాత రొక్కం విషయమై 'మావల్ల కాదు వేడుకలు జరుపుతాం మా శక్తికొలది కానివ్వండి' అన్నారు వచ్చినవారు. సరే నన్నారు పానకాలుగారు.

౪

వెంకమ్మగారి కొడుకుకు పెండ్లై రెండేళ్లైంది. కొడుకు పెండ్లిముందుఉన్న సంతోషము ఉత్సాహము ఇప్పుడులేవు. వియ్యాలవారి పేరుచెబితేనే మునమున చిరచిరగా ఉంటున్నది.

పానకాలుగారికి కొంచం జ్వరంవచ్చి అదేయెక్కువైంది బ్రతికే స్థితికూడా కనిపించలేదు.

ఒకరోజు సాయంకాలం చెఱువునుంచివచ్చి ఏదో విసుక్కుంటూ పొయ్యిదగ్గిర కూర్చున్నది వెంకమ్మ.

"ఏమే ఇవ్వాళ నాకు మందుగతికూడా లేనట్లుంది. మళ్లీ యేదో మొదలపెట్టావే విసుక్కోటం?"

"మీ మీదేవిసుగు నాకు. ఏదో కష్టంగాఉండి అనుకుంటే? మీకెందుకూ?"

"యేమిటి యివ్వాళ మళ్లీక్రొత్త?"

"ఏమిలేదు ప్రతివాళ్లు పిల్లవాడికి కట్నాలిచ్చి కానుకలిచ్చి పిల్లనిస్తామని వస్తూంటే, మనకెక్కడ దొరికింది ఈ దిక్కుమాలిన సంబంధం? ఆడపిల్లలకుగాని పిల్లవాడికిగాని వక్కముచ్చటైనా జరపలేదు కదా? ఇప్పుడు కరణంగారిభార్య చీవాట్లు పెట్టింది. ఇంకా కొన్నాళ్లుజరిగిన తరువాతైతే యెక్కువకట్నం ఇచ్చేవాళ్లని."

"నువ్వే కుదిర్చావుగా? ఇంకా అనుకోట మెందుకు?"

"అందుకనే నోరునొక్కుకుని ఊరుకున్నాను"

"అయినా నేనేం కుదిర్చాను? ఆమె చెప్పిన మాటలు చెప్పాను. మీరేగా అంతా కుదుర్చుకున్నది."

"యెవరు కుదిర్చినా నీయిష్టప్రకారమేగా? వద్దనలేక పోయావా?"

"ముందు మనకేం తెలుస్తుంది?"

"ఇంకొకచోటమటుకు ముందు నువ్వేం తెలుసుగుని చేసుగునేదానివి? అయినా వాళ్లేం తక్కువ చేశారు? అనుకున్నప్రకారం అన్నీఇచ్చి రత్నంలాటి పిల్లనిచ్చి శక్తికొలది చక్కగా పెండ్లిచేశారు. నువ్వే అన్నింటికి పేచిపెట్టి అలిగి అన్నంతినక, పిల్లకు పెడతానన్న వస్తువులు చీరలు పెట్టక నానా ఆగడంచేశావుగాని వాళ్లేంచేశారు?"

"మీ కదొక్కటి కనిపిస్తుంది నేను చేసింది. వాళ్లు వక్కముచ్చటన్నా జరపకపోతే మీకు బాగానే ఉన్నది. సొమ్ము అప్పుడు పెట్టకపోతే యెక్కడికి

పోయిందిఁ యెవరన్నా తీసుకున్నారా? ఇక్కడికొస్తే ఆవిడే పెట్టుగుంటుంది. ఇక ముచ్చట్లురావు గాని సొమ్ముకేం చక్కగా పెట్టుక్కులుకుతుంది.”

“నీ మొఖమ్మండా! ఇక్కడికొస్తేమటుక్కు దాన్ని పెట్టుకుని అనుభవించనియ్యబోతున్నావా ?”

“నన్ను తిట్టటం బాగా తెలిక మీకు. పాళ్లపన్ను మీక్కనిపించవు. పెండ్లై రెండేళ్లైంది. వక్కమాట న్నా పిల్లవాణ్ణి తీసుగెళ్లారేమో చూడండి. పిల్లన్నా కాపురానికి వస్తుందేమో అంటే అదీ కనిపించలా. నిఁడందినగూడు ఈ ఏడు అందటంలేదు. అమ్మగారి పెట్టేమోగాని.”

“పాపం వాళ్లేంచేస్తారు ? నాలుగైదుమాట్లు వచ్చినా తడవకొక వంకచెప్పి ఆఖరుకీ అయిదువంద లిస్తే పంపుతానంటివి. ఇకవాళ్లేంచేస్తారు? ఇవ్వలేక ఊరుకున్నారు. నీ అల్లుళ్లకు నీవు ఇచ్చి తెచ్చావా? మాట్లాడితే వందలెక్కడ తెస్తారు పాపం వాళ్లు మటుక్కు.”

“యేమో లోకంతోపాటుగా అన్నీ ఇస్తారు గదా అనుకున్నానుగాని అన్నీ ఇల్లా సున్నాచుడతారనుకో లేదు. యేమైతే నాకెందుకు లెండి. ఇంకా వాళ్ల గుమ్మం నేను తొక్కుతానా ?”

“వోసి నీమొఖంతగలెయ్య! యింతతృప్తిలేందానికి యేంపెట్టి యేంప్రయోజనం. రాక్షసి! ఆ పిల్లవస్తే మటుక్కు నువ్వు కేగనివ్వబోతున్నావా? ఏమైతే నాకెందుకు ఇవ్వాళో రేపో చావుసిద్ధంగా ఉన్నవా డికి భగవంతుడా” అని కళ్లుమూసుగున్నాడు పాన కాలు.

⁂

రాఘవరావుకు భార్య కాపురానికివచ్చింది కాని ఖాయమైన ఉద్యోగంమ్మాత్రం కుదరలేదు.

రాజేశ్వరి అత్తవారింటికి వచ్చినప్పటినుంచి సుఖము సంతోషము యెఱుగదు. కోడలు ఇంటిలో అడుగు పెట్టినప్పటినుంచీ వెంకమ్మగారు వీధిఅరుగు దిగడం మానుకుంది. జీతగాణ్ణి మానిపించింది. చాకలివాన్ని మానిపించింది. ప్రొద్దుగూకులు ఇంటిపనికంతా రాజేశ్వరి బాధ్యత. పాచిపని గొడ్లదగ్గిర బాగుచేయుట మొదలు నీళ్లు తేవటం వంటపనులన్నీ రాజేశ్వరి వక్కతే చెయ్యాలి. పగలు భర్తగారితో మాట్లాడ కూడదు. అందరు వెళ్లేవేళకు చెఱువుకు వెళ్లకూడదు. నీడను అంట్లుతోమకూడదు. ఇన్ని కట్టుబాట్లు రాజే శ్వరికి. అత్తవారింటికిరాంగానే పుట్టింటివారు పెట్టిన సొమ్ముకూడా తీసుగుని చేతికి మట్టిగాజులు మెళ్లో పసుపుకొమ్ము కట్టింది వెంకమ్మ. రాజేశ్వరి బస్తీపిల్ల. ఇట్లో పనిపాట్లు చేసిందికాదు. చదువు ఆటపాటలు దప్ప ఇంకొకపని చేసియెఱుగదు పుట్టినింట్లో. ఇక్కడికి వచ్చినప్పటినుంచీ వక్కమాటు కొండవిరిగి పడ్డట్టుగా జీతగాడు చేసేపని దగ్గిరనుంచీ వంటమనిషిచేసేపని వరకు రాజేశ్వరి నెత్తినపడ్డది భారం. యెంతపనిచేసినా చెప్పిచేయించుకుంటే కొంచెము తేలిక. లేక చేసినట్లు ఊరుకుంటే అంతకంటే తేలిక. అదీఇదీ కూడాకాదు రాజేశ్వరి అత్తగారి పద్ధతి. తాను ఇల్లాచెయ్యమని చెప్పదు, చేసినట్లు ఊరుకోదు. పనులు ఆజ్ఞాపించడం, క్షణక్షణానికివచ్చి ‘ఇంకాకాలేదా?’ అనడం చేసి నట్లాయనా ఈపని అల్లాచేశావు ఆపని యిల్లాచేశావు అని వంకలుపెట్టి చీవాట్లుపెట్టటం ఆమె వంతు. ‘క్షమయాధరిత్రిన్’ అన్నపదాన్ని సార్థకంగా చేస్తున్నది రాజేశ్వరి. తల్లి యెన్ని అక్షరాలు చెప్పితే అన్నిఅక్షరాలు నడవాలిగాని హెచ్చుతగ్గు నడవడానికి వీల్లేదు రాఘవరావు. భార్య అన్నము పెడితే తిన కూడదు రాఘవరావు. తల్లిపెడితే తినాలి. భార్యా తానుకూడ లేకపోతెలేదు. చెయ్యడంవరకే రాజేశ్వరి వంతు, తినడానికి అర్హతలేదు. అత్తగారుపెట్టిన అర్థన్నంతిని రాజేశ్వరి మధ్యాహ్నం వొంటిగంటవేళ

మిడమిడకాలే యెండలో అంట్లువేసుగుని తోముతున్నది.

రాజేశ్వరి పదునారువత్సరముల బాల. యెండ తగిలితే వాడిపోయే శరీరము. చక్కని కనుముక్కు తీరుగలది. చదువు సంగీతము కుట్టుపనులు అన్నీ నేర్చుకున్నది. యేమి నేర్చుకుని యేమి ప్రయోజనము? అత్తగారిముందర అడివిని గాచిన వెన్నెలచందముగా ఉన్నది రాజేశ్వరి బ్రతుకు. తాను వచ్చినప్పటినుంచీ తండ్రి యెన్ని ఉత్తరములు వ్రాసినాజవాబువ్రాయరు, తనను వ్రాయనివ్వరు. పంపమనివస్తేపంపరు, మాట్లాడనివ్వరు. మళ్లీ ఈరోజు ఉత్తరంవచ్చింది తల్లికిజబ్బుగా ఉన్నదని, అక్క చూడటానికి వచ్చిందని, పంపుతామని వ్రాస్తే వచ్చి తీసుకువెళ్లుతానని వ్రాశాడు తండ్రి. ఆయెండలో అంట్లుతోముతూ తలంచుకున్నది తనస్థితి. తనను ఇంత కఠినముగా చూడటానికి కారణం యేమైఉంటుందీ? అని తనలోతాను విచారపడుతూ కళ్లనీళ్లు తెచ్చుగుంది. రెండు కన్నీటి బిందువులు క్రిందపడ్డాయి.

భర్త పోయినప్పటినుంచీ వెంకమ్మగారికి అధికారం యెక్కువైంది. నెత్తిమీదికి కత్తివస్తే కలక్టరంత హోదావస్తుందన్నట్లు ఆమె అధికారమంతా కోడలిమీధ చలాయిస్తున్నది.

"యేమే రాజేశ్వరీ! అంట్లుతోమటం ఇంకా కాలేదూ? ఎంతసేపైందే దొడ్లో కూర్చుని. ఎందుకు ఏడుస్తున్నావు? మేమంతా బ్రతికిపోయినామనా? తిన్న తిండి అరగలేదా? నీ యేడుపే కొడుతున్నది కొంపకు. నీపుస్తె ముడిపడ్డది మొదలు మాకొంప నాసినం అవుతున్నది. పుస్తెముడేసి రాంగానే మామగారు చచ్చాడుగదా. ఇక నేనున్నానని యేడుస్తున్నావా? నీ యేడుపు కొట్టేపోతున్నది కొంప. బిడ్డ అష్టకష్టాలు పడుతున్నాడు. ఇంకా నీ యేడుపెందుకే? దిక్కుమాలినదానా. నా కొడుకోసమె కన్నది కాబోలు మీఅమ్మ. యెన్నన్నా మాటామంతిలేదు మొద్దురాచ్చిప్పలాగ. తోటివాళ్లు పనులన్నీ చేసుకుని గొడ్లకు గడ్డితేవడంలేదూ? మాకా రాతలేదు. దున్నపోతులాగ నిన్ను మేపి గొడ్డుకు గడ్డికోనాలి. యేమి సుకుమారం వెళ్లపోస్తున్నావే అమ్మా. అంట్లుచెట్టునీడను దప్ప తోమకూడదూ? యెన్నిమాట్లు చెప్పాను చెట్టు పాడైపోతుందని."

"చెట్టునా అంట్లు తోమలేదండీ. ఇప్పుడే తొలిచి ఇక్కడికి తెచ్చాను" అన్నది రాజేశ్వరి నెమ్మదిగా.

"అదుగో యెదురు జవాబులుకూడా చెపుతున్నావూ! నా ప్రారబ్దంకొద్దీ దొరికావు" అని నెత్తి మోదుకుంటూ వాకట్లోకి వెళ్లింది వెంకమ్మగారు

రాజేశ్వరి అంట్లు తొలిచి దొడ్డి అరుగుమీదపెట్టి తడిబట్ట బిందలోవేసుకొని "అత్తగారూ! అంట్లు చూచివెళ్లితే ఇంట్లో పెడతాను" అని చెఱువుకు వెళ్లబోతున్నది.

"నీళ్లకు దబ్బున వెళ్లిరావే అని నెత్తినోరు పెట్టుకొని చెప్పినా నలుగురు వచ్చేవేళకు గాని బైలుదేరవు. వాణ్ణి వెధవనుచేశావు. నన్ను చూస్తే అసలే లక్ష్యంలేదు. నీ ఇష్టంవచ్చినట్లు చేస్తున్నావు. నీవు రాణి వయ్యావులే. నిన్న మొన్న వచ్చిందానివి. యెంతదానివయ్యావే? మాట్లాడకుండా తడిగుడ్డలతో గొంతులు కోస్తున్నావు."

"ఇంకా అందరు వచ్చేవేళ కాలేదండీ అత్తగారు. ఇప్పుడే రెండు గంటలైంది" అన్నది రాజేశ్వరి జాలికలిగేటట్టు.

"యెదురు జవాబుచెప్పటం బాగా నేర్చావు. నాకేం తెలుసు పల్లెటూరి వచ్చిందానికి? బస్తీ పిల్లవు గనుక నీకు గంటలు తెలుస్తాయి. నువ్వు ఇన్నిమాటలు జవాబు చెపుతున్నా ఆగదిలో కూర్చుని మాట్లాడుతాడేమో చూడు మొద్దులాగ. అల్లాచేశావు వాణ్ణి. తిరగవేం వెనక్కు. నీళ్ల కిప్పుడు వెళ్లొద్దు. పొద్దుకూకాక వెళ్లుదుగాని. అన్నీ నీ ఇష్టప్రకారం చెలా

యించుదామంటే సాగుతాయనుకున్నావా? నీవు చస్తే రెండో పెళ్లన్నా చేస్తాగాని నువ్వు చేసినట్టు ఊరుకోను. లేకపోతే లేచిపో. ఇప్పుడుపో నీ పుట్టింటికి" అని కసిరింది వెంకమ్మగారు.

రాజేశ్వరి ఇంట్లోకివచ్చి కండ్లు తుడుచుకుని "అత్తగారూ! అంట్లు ఇంట్లోపెట్టనా?" అన్నది నిర్జీవంగా. "పెట్టూ నువ్వొచ్చినప్పటినుంచీ అంట్లకూడూ మైలకూడూదప్ప శుచిశుభ్రము ఉన్నదీ? అన్నీ శ్రాద్ధాన్నె చూసేడుచుకుంటూ. వెడంగా తగలెయ్యి" అని వరండాలో ఫెడేలుమని మంచం వాల్చుకుని పడుకొన్నది వెంకమ్మ.

౬.

చాలా ప్రయత్నంమీద నరసారావుపేట బోర్డు ఎలిమెంటరీస్కూల్లో ఖాయమైన నౌకరీ దొరికింది రాఘవరావుకు. రాఘవరావుకు తల్లీ భార్యా కలతల విషయం తెలుసు. తప్పంతా తన తల్లిదేననికూడా బాగా తెలుసు. అయితే తాను జోక్యం కలుగజేసుకోనని కారణం ఏమిటంటే తల్లికి తాను వక్కడే కొమారుడు. ఏమిటమ్మా ఈ కలతలు అని అడిగితే తాను వేరే ఉంటాననంటుంది. లేకపోతే కూతురిదగ్గిరికి వెళతానంటుంది. తలచెడ్డ అక్కకూడా చేరింది. ఇద్దరుకలసి తననే అల్లరిపెడతారని భయం. భార్యననటానికి కారణం కనిపించదు. భార్య గుణము తనకు బాగా తెలుసును. ఎక్కువ నిదానం కలది, శీలవతి, గుణవతి, రూపవతి. తల్లి ఇన్నికష్టములు పెడుతున్నా ఇరుగుపొరుగు వారితోగాని తనతోగాని ఎన్నడుచెప్పకొని ఎఱుగదు. ఇల్లాగంటి పరమసాధ్వీమణిని ఏమి అనటానికి తోచలేదు రాఘవరావుకు. అనకపోతే భార్యను నెత్తిన ఎక్కించుకుని ఊరేగుతున్నావని తనను కూడా అంటుంది తల్లి.

రాఘవరావు నిదానంకలవాడు. బుద్ధిమంతుడు తెలివితేటలు కలవాడు. పదిమంది పెద్దమనుష్యులతో తిరుగనేర్చినవాడు. వస్తుత నిదానంకలవాడైన రాఘవరావు కత్తీ నాగలిసందునా నలిగిపోతున్నాడు.

నరసారావుపేట కాపురం. అంతా చేరారు. రాజేశ్వరి యెన్నిరోజులనుంచో వోర్చుకుని స్వాతివానకు ముత్యపుచిప్పలాగ, కనిపెట్టుకుని కూర్చున్నది. భర్తకు ఎక్కడనన్నా ఉద్యోగమైతే బస్తీలోసుఖపడుదామని యెదురుచూస్తున్నది. బస్తీచేరినప్పటికి ఏమీ ప్రయోజనం కనిపించలేదు. రాజేశ్వరి ఇక్కడికి వచ్చేటప్పటికి ఇంకోగ్రహం హాజరైంది. పెద్దాడబడుచు భర్త పోయినాడు. ఆవిడ ఇక్కడికే చేరింది. అత్తగారికంటే ఇంకా కఠినత్వము, నిర్దయా, యెక్కువ ఈమెకు. స్వంత ఊరు పల్లెటూరైనా నీళ్లుముంచుకరావడమే తప్ప తోడక్కర్లేదు. ఇక్కడ చాలా లోతునుంచి నీళ్లుతోడటం. రాజేశ్వరి వక్కతే కావడంచేత చేతులు కాయలు కాస్తున్నాయి. అంతచక్కనిపిల్ల గుర్తుపట్టలేనట్లుగా మారిపోయింది. అమృతపాత్ర లభిస్తుందనుకున్న రాజేశ్వరికి విషతుల్యంమైంది. రోజులు గడచుట దుర్భరంగా ఉన్నది.

నరసారావుపేటవచ్చి కొద్దిరోజులైనా, ఊరంతా పరిచయమైంది వెంకమ్మగారికి. పురాణాలకు వెళ్లడం, గుడికి వెళ్లడం, పెత్తనాలకు వెళ్లడం బాగా అలవాటైంది. ప్రక్కంటి ఇన్‌సుపెక్టరుగారి తల్లివచ్చి "వెంకమ్మగారు ఇవ్వాళకూడా పురాణానికి రారు? వారంరోజులనుంచీ రావడం మానేశారు?" అన్నది.

"ఏం చెయ్యను కామమ్మగారు మీకు నిక్షేపంలాంటి కోడలు వరాలకుప్ప దొరికింది గనుక మీరు యెక్కడికి వెళ్లినా జరిగిపోతుంది. నా కోడలు అరవందప్పిల్ల అన్నిపనులు నేనే యాడవాలె. మళ్లీ తెలివితక్కువది కాదు. కావలసినంత కాణాతనం ఉన్నది."

"నీవు అన్నీ నెత్తినేసుకుంటావు గనుక చెయ్యాలి. నువ్వూరుకో ఆవిడే చేసుకుంటుందో లేదో చూడో

చ్చు మనకోసం చేసుకుంటారా ? మనం నెత్తిన వేసుకుంటే మనకే బాధ. నేనేమి కలుగజేసుకోను గనుక నా కోడలు మంచిదిలా కనిపిస్తుంది. నా కోడలు నెరజాణ. అయితే ఆవిడ పనులకు నేను కలుగజేసుకోను గనుక అందరికీ ఆవిడ మంచిదిలాగ కనిపిస్తుంది. క్లబ్బులని మీటింగులని లెక్చర్లని ఆవిడ స్నేహితులు ఆవిడ మూడింటికే వెళ్తుతారు. వాడు వచ్చేవేళకు వస్తుంది. ఇవ్వాళ అప్పుడే వెళ్లింది, తాసీలుదారి కోడలు ఆవిడాను. మొగుడికిష్టమైనప్పుడు మనకెందుకు? ఆడుకునే పిల్లలు, షికారుకు పోయినా కొడుకు, చదువుకునే పిల్లలు, ఆవిడాకూడ వక్కమాటు వస్తారు. చంటిపిల్లవాడు ఏడుస్తూ ఉంటాడు. పాలుపెరుగు తెచ్చి వాళ్లు నుంచుంటారు. ఇంత గిజాలుగా ఉన్నప్పైనా. 'అదేమీ' అని వాడు అనడు. అలాంటప్పుడు నాకెందుకూ? అని నేను చూస్తూ ఊరుకుంటాను. వాళ్లు తిన్నవేళకు నాకూ కాస్త పెడతారు. అలా పూరుకోవాలి గాని, వెంకమ్మగారు ! ఇంకా మనకెందుకు ఈ గొడవలు ?"

"నాకెందుకూ అని ఊరుకుంటే నాకెలా జరుగుతుంది? ఇరువు చెడ్డ ఆడపిల్ల ఇంట్లో ఉన్నప్పుడు దాన్ని చూడొద్దూ ?"

"సరే నీ ఇష్టం నీవు రాకపోతె నేను వెళ్లుతున్నా" అని వెళ్లింది కామమ్మగారు.

రాత్రి ఏడుగంటలైంది. అత్తగారికీ ఆడబిడ్డకు భర్తకు వకేమాటు వడ్డించి ఏమి హెచ్చుతగ్గు వస్తుందో అని ప్రాణాలన్నీ పిడికిట్లో పెట్టుకుని గోడవారగా నుంచున్నది రాజేశ్వరి.

ఉప్పుపిండి విస్తరిముందరికి తీసుకుని "యేమె రాజేశ్వరి! పిండిలో పెసరపప్పు వెయ్యమంటే కొబ్బరి కోరువేశావు నీ కిష్టమా యేం? అల్లా నుంచున్నావేం మొద్దులాగ ? యెందుకు వెయ్యలేదు పెసరపప్పు? ఈ పిండి నా కొద్దు నీముఖానకొట్టుగో. అన్నమూ పిండీకూడా నీ పొట్టనే పగలకొట్టుగో. ఒక్కపూట పిండి తిని భగవంతుడా ఏడుస్తున్నా" అని రివ్వున లేచి వెళ్లింది విస్తరి ఒదిలిపెట్టి ఆడబిడ్డ.

ఈ ఘర్షణ వింటూ పెద్దదౌతుందనే ఉద్దేశ్యముతో చప్పున రెండుమెతుకులు తిని ముందే లేచాడు రాఘవరావు.

"యేమే రాజేశ్వరి ! దానికి వేడిచేసి పెసరపప్పు వేసి పిండి చెయ్యమంటే నీ ఇష్టంవచ్చినట్లు చేస్తావా? ఇంత లక్ష్యం లేదేమే నీకు ? దిక్కుమాలిన దయ్యమా. నువ్వు చస్తె నా కొడుక్కు రెండో పెండ్లి చేస్తానే పోయిగాను. మరీ కడుపొచ్చింది మొదలు మూడోకన్ను తెరచావు. బిడ్డతల్లి నౌతాకదా అని కాబోలు నీసంతోషం. వాణ్ణి వళ్లో వేసుకుని పొట్లాలు పొట్లాలు దులుపు కుతినడం మరిగి ఆడుతున్నానను కుంటున్నావు కాబోలు. నీ ఆటలు సాగవిక్కడ. ఆ పసివాడు కాంతం చేతులో అన్నా వక్కరవ్వ పెట్టవు. దీనికి లేకలేరుగడా? దాని పిల్లవాడు ఒక్కమాటువస్తె సరి కళ్లల్లోపెట్టుకుంటావే. నీ దిక్కుమాలిన కని మొఖం చూడగూడదే" అని విస్తరిముందు నుంచి లేచింది వెంకమ్మ.

అత్తగారు ఆడబిడ్డ తినకుండా తాను తింటే ఊరుకోరు. యేం చేస్తుంది తానుకూడా తినకుండా మూత లేసి ఇల్లు కడిగి పడకగదిలోకి వెళ్లింది రాజేశ్వరి.

ఈ రోజు అప్పుడే వచ్చింది అన్నం తినలేదని గ్రహించాడు రాఘవరావు.

"రాజేశ్వరీ ! నిండుచూలాలువు గదా ? నీవు కూడా భోజనము చేయకపోతే కష్టంగాదూ ?" అన్నాడు రాఘవరావు జాలిహృదయంతో.

"నేను అన్నంతినకపోతే యెవ్వరికిజాలి. మీతల్లిగారుఅక్కగారుఅనేమాటలు వింటూఉంటేకడుపులో పేగులు దూసుగొస్తున్నాయి, ఎన్నాళ్లుపడను ఈమా

టలు ఈకష్టాలు, ఈఇంట్లో అడుగుపెట్టింది మొదలు పుట్టినిల్లెరుగనుగదా? మొన్న మాయన్నగారు పురిటికి తీసుగెళ్లటానికి వస్తేఇంటికిరానివ్వక నానామాటలు అన్నది తమరికి తెలుసునుగదా? పొరుగింటి సీతమ్మగారింట్లోఉండి నాకు చీరలు రవికలు కొనిఇచ్చివెళ్లితే ఆ చీరలుతీసుకుని చిన్నవదినెగారికి పంపింది. మళ్లీ నా చిరుగులచీరలను నేను ఇల్లాఅనుభవించ వలసినదే. ఎన్నాళ్లు ఈ కష్టాలు. మొన్న మా పిన్నికూతురు చేమంతిపూలపొట్లాము పంపిందే, అవిచూచి నేనేమొ తెప్పించుకు తింటున్నానని గోలపెడుతున్నది; ఏంచెయ్యను?" అని రాజేశ్వరి కళ్లనీళ్లపెట్టున్నది.

"రాజేశ్వరి! నేనేంచెయ్యనూ? అన్నీచూస్తూనే ఉన్నాను. మా అమ్మకు నేను వక్కడుకుమారుణ్ణి. ఏమన్నాఅంటే భార్యపక్షంచేరి నాతో పోట్లాడావంటుంది. నేను వేరేఉంటానంటుంది. ఒక్కకొడుకుని తల్లిని వేరుపెట్టారంటారులోకం, అన్నీలోఆలోచించి నేనూ తటస్థంగా ఊరకుంటున్నాను. యెప్పటికన్నా మంచిరోజులు రాకపోతాయా? ఆమె యెన్నాళ్లు బ్రతుకుతుంది?" అని ఏవో నాలుగ చల్లని మాటలు చెప్పాడు రాఘవరావు.

"ఏంచేసినాసరే మా తల్లితండ్రులు పదునాలుగేండ్లు పెంచి మీచేతుల్లో పెట్టారు చంపినామీరే, బ్రతికించినామీరే"అని రాజేశ్వరి కొంచముసేపు కళ్ల నీళ్లుకార్చి నిద్రపోయింది.

౨

రాజేశ్వరి ప్రసూతిఅయింది. ఆడశిశువు కలిగింది. శిశువు భూమ్మీదపడగానే రాజేశ్వరి స్మృతితప్పి పడిపోయింది. వెంకమ్మగారు ఖంగారుపడుతూ వాకిట్లోకి వచ్చి 'అబ్బాయి! రాజేశ్వరి మాట్లాడ్డంలేదు నాయనా డాక్టరుగార్ని పిలు' అని అదుర్దాగాచెప్పి మళ్ళీ ఇంట్లోకి వెళ్లింది.

వెంటనే జట్కాబండి తీసుకెళ్లి డాక్టర్ను తీసుకొచ్చాడు రాఘవరావు. డాక్టరు ఇంజక్షను ఇచ్చాడు. రాజేశ్వరికి కొంచం తెలివివచ్చింది. గాని తాను ఇక బ్రతుకనని తోచింది రాజేశ్వరికి. తాను చెప్పదలచుకున్న రెండుమాటలు చెప్పాలనుకున్నది.

డాక్టరు గుండె, నాడి పరీక్షించారు. ఇక లాభం లేదనుకుని 'హోప్లెస్ సార్' అని బండి యెక్కబోతున్నాడు డాక్టరు. రాఘవరావు బండిదగ్గిరకు వచ్చి డాక్టరు రెండు చేతులు పట్టుకుని "మీరడిగిన డబ్బిస్తాను మందివ్వండి" అన్నాడు.

"మందిచ్చినా లాభంలేదండీ. గర్భిణిస్త్రీ చెయ్యకూడని పరిశ్రమ చేయించినారు. అందువల్ల నరములు గుండె బలహీనమై చెడిపోయినవి. ఆమె ఆహారము కూడా మంచిది తిన్నట్లు కనిపించుటలేదు. ఇక లాభంలేదు" అని వెళ్లిపోయినాడు డాక్టరు.

రాజేశ్వరి కండ్లు తెరచి వక్కమాటు భర్తను పిలవమన్నది. అక్కడేఉన్న రాఘవరావు యెందుకన్నాడు కండ్లు తుడుచుకుంటూ.

"నాకు వక్కకోర్కె ఉన్నది. ఇప్పుడన్నా తీర్చండి. ఈబిడ్డ బ్రతికితే నా తమ్ముడికిచ్చి పెండ్లిచెయ్యండి. నామాదిరిగా కష్టాలపాలు కాకుండా సుఖంగా బ్రతుకుతుంది. మీఅమ్మ యెన్నాళ్లు బతుకుతుందన్నారు గదా. నేనే ముందుపోతున్నాను. యెవరి బ్రతుకు యెవరికి తెలుస్తుంది? మీకు ఇదేనా కడాసారి వందనం. నేను వెళ్లిపోతున్నా. అత్తగారు మళ్లీ మా అమ్మను చూపించారు కారు గదా? మీకు ఇదే నా నమస్కారం" అన్నది.

రాజేశ్వరి కళ్లు మూసుకుపోయినాయి. అంతా గొల్లుమన్నారు.